# కాళిదాసు మేఘ సందేశం

సత్యనారాయణ మూర్తి గరిమెళ్ల: 93463 34136

భోజరాజు ఆస్థానాన్ని అలంకరించిన గొప్ప కవి కాళిదాసు. కాళిదాసు పేరు వినని వారు భారత దేశంలోనే ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అమాయకంగా ఉండే కాళిదాసుని ఒక ఊరి పడచు 'అస్తి కశ్చిత్ వాక్ విశేషః ?' అని ప్రశ్నించిందట. అనగా 'నీకు కొంచమైనా మాట్లాడగలిగే విషయముందా? అని. అమ్మవారి అనుగ్రహంతో గతాన్ని మరచిపోయిన కాళిదాసు మదిలో మాత్రం ఆ పడచు పలికిన ఆ మూడు పదాలు ఉండిపోయాయని చెప్తారు. కాళిదాసు సంస్కృతంలో మూడు ప్రసిద్ధమైన కావ్యాలు రచించారు. అస్తి కశ్చిత్ వాక్ అనే మూడు



పదాలతో కాళిదాసు ఈ మూడు కావ్యాలను ఆరంభం చేశాడని సింగరాచార్యులవారి వ్యాఖ్యలో వ్రాశారు.

ఆ కావ్యాలు కుమార సంభవము, మేఘ సందేశం, రఘువంశము. ఈ మూడు, కావ్య సామ్రాజ్యంలో అజరామరాలుగా నిలిచిపోయాయి. ఈ మూడు కావ్యాలలో విరహ శృంగార రస ప్రధానమైనది మేఘసందేశం. "కశ్చిత్ కాంతా విరహ గురుణా — స్వాధి కారాత్ ప్రమత్తః" తో ప్రారంభమవుతుంది. అనేక సంస్కృత పదాలతో పాటు కాళిదాసు రచనా వైచిత్రి, అలంకార ప్రశస్తి ఈ కావ్యంలో చూడవచ్చు. ఈ కావ్యానికి 'మేఘదూతము' అన్న పేరు కూడా ప్రాచుర్యం లో ఉన్నది. సంస్కృతంలోని పంచ మహా కావ్యాలలో మేఘసందేశం ఒకటి. ఇది ఒక ఖండ కావ్యం. ఏ కథతోను సంబంధం లేకుండా ఉన్న ఒక ఘట్టాన్ని కావ్యంగా మలిచాడు కాళిదాసు.

మేఘసందేశ మూల కావ్యంలో మందాక్రాంత వృత్తంతో ఉన్న శ్లోకాలు 111 అంటారు. అయితే వావిళ్లవారి గ్రంథంలో నూట ఇరవై నాలుగు శ్లోకాలు చెప్పబడ్డాయి. మేఘసందేశ కావ్యం పూర్వోత్తర భాగాలుగా చెప్పబడింది. పూర్వ మేఘంలో 67 ఉత్తర మేఘంలో 57 శ్లోకాలు

ఉన్నట్టుగా తెలుస్తోంది. సంక్షిప్తంగా చెప్పబడిన ఈ కావ్యంలో కాళిదాసు ప్రతిభ ప్రతి ఘట్టంలోనూ కనిపిస్తుంది. ఆయన వర్ణనా నైపుణ్యం, అలంకార పటిమ, పాత్ర చిత్రీకరణ, శృంగార శైలి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఇవే గాక కథలో అనేక భౌగోళిక అంశాలు పొందుపరచబడ్డాయి నూట ఇరవైనాలుగు శ్లోకాలతో అలరారిన మేఘసందేశానికి ఒక విశిష్టమైన స్థానం ఉన్నది. తన విధులలో అశ్రద్ధ వహించటం వల్ల యజమాని ఆగ్రహానికి గురియై విధులనుండి తొలగించబడి, శక్తులను కోల్పోయి ఏడాది పాటు బహిష్కరించబడి కాంతా వియోగాన్ని అనుభవించిన ఒక యక్షుని కథ మేఘసందేశం.

పూర్వ మేఘం

అలకాపురికి ప్రభువైన కుబేరుడు తన కొలువులో నున్న ఒక యక్షుణ్ణి ఒకానొక తప్పిదానికి శపించి ఒక సంవత్సర కాలం కొలువునుండి బహిష్కరిస్తాడు. శాపానికి గురియై తనకున్న మహిమలను కూడా పోగొట్టు కొని దేశ ద్రిమ్మరియై తిరుగుతు యక్షుడు చిత్రకూటం చేరతాడు. జనకుని పుత్రిక సీతాదేవి స్నానం చేయటం వలన పవిత్రమైన నీరు కలిగి, నీడనిచ్చు దట్టమైన చెట్ల నడుమ ఉన్న రామగిరి ఆశ్రమంలో ఆ సమయంలో తలదాచుకున్నాడు యక్షుడు. తాను రాజ్యం విడిచి వచ్చాడు కానీ తన ప్రియురాలు అలకాపురి లో ఉండిపోయింది. యక్షులు సాధారణంగా కాముకులు గనుక వారికి కాంతా వియోగం భరించలేనటువంటిది. తాను అనుభవిస్తున్న ఎడబాటును ఏవిధంగా ఆమెకు తెలియజేయాలి అనుకున్నాడు. సందేశం రూపంలో తన భావాలను ఆమెకు చేరవేయాలని తలచాడు. అయితే అది ఎలా సాధ్యం అనుకున్నాడు. అప్పుడే నిర్మలమైన ఆకాశంలో ఒక నీలి మేఘపు తునక తేలియాడుతూ నెమ్మదిగా కదులుతోంది. అది చూచిన అతడికి ఎవ్వరి ఊహలకు అందని ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది.

ఆ యక్షుడు చిత్రకూటము పరిసరాలలో తానున్న రామగిరి అరణ్యమునుండి కైలాసగిరి పైన అలకాపురియందున్న తన ప్రియురాలికి ఆకాశంలో వెళుతున్న మేఘం ద్వారా సందేశం పంపించ దలచాడు. తన వియోగం తన ప్రేయసి తట్టుకోలేదని దుఃఖ పూరితయై ఉంటుందని తలచిన యక్షుడు ఆమెను ఊరడించటానికి తన సందేశాన్ని ఆమెకు అందించమని మేఘుణ్ణి కోరతాడు. మేఘుడు ఉత్తమ కులమునకు చెందినవాడు కనుక, ఒకవేళ తన అభ్యర్ధనను అతడు తిరస్కరించినా చిన్నతనంగా భావించ నవసరము లేదని భావిస్తాడు. మేఘుడు వెళ్ళవలసిన

మార్గాన్ని, మధ్యలో కనిపించే ప్రదేశాలు కానవచ్చే సుందర దృశ్యాలు వర్ణించి చెప్తాడు. కాళిదాసు ప్రతిభ ఆయన ఊహాశక్తి కావ్యంలో ఇక్కడే కనబడుతుంది.

ఆ సందర్భంలో మేఘునితో మైత్రిని కలుపుతూ, అతడిని ఉత్సాహ పరిచాడు యక్షుడు. యక్షుడు మేఘునితో 'మిత్రమా ఆషాఢ మాసం చల్లని పిల్ల తిమ్మెరలు వీస్తూ ఉంటాయి, ప్రయాణానికి అనుకూలమైన సమయం ఇది. ఎటు చూసినా శుభ శకునాలు గోచరమౌతున్నాయి. రెక్కలువిప్పి ఆకాశ మార్గంలో ఎగురుతున్న హంసలు మానస సరోవరం వరకు నిన్ను వెన్నంటి తోడుగా ఉంటాయి. దారిలో ఎత్తైన పర్వతాలు ఎదురౌతాయి. దూర ప్రయాణం కనుక బడలిక అనిపిస్తే పర్వత సానువులపై సేదదీరు. క్రింద నదీ ప్రవాహాలు ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి. 'నాకున్న శక్తి సరిపోతుందా అంతవరకూ వెళ్లేందుకు' అన్న సందేహము వలదు. మధురమైన నదీజలాలలో దప్పికతీర్చుకో. దారిలో వచ్చే అరణ్యాలలో కార్చిచ్చుకు భయపడవలదు. నీకు వాటిని ఆర్పివేయగల శక్తి ఉన్నదన్న విషయం గుర్తుంచుకో. సుందర వనాలలో అందమైన నెమళ్ళు నిన్ను స్వాగతిస్తాయి, తమ నాట్యం చూడమంటాయి. చూసి ఆనందించు, కానీ గమ్యం ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా చేరాలన్న సంగతి విస్మరించకుసుమా !

మేఘమా ! ఈ చిత్రకూట పర్వతం (ప్రస్తుతం మధ్య ప్రదేశ్ లోని రామ్ గఢ్ ) శ్రీరాముని పద స్పర్శ చేత పవిత్రమయ్యింది. ఈ పర్వతానికి నమస్కరించి బయలుదేరు. మాల పర్వతం మీదుగా (ఛత్తీస్ గఢ్) నర్మదా నదీ జన్మస్థానమైన ఆమ్రకూటం చేరుకో. దశార్ణ దేశ రాజధాని విదిశా నగరాన్ని(భిలాస) సందర్శించు.

వింధ్య పర్వతాల ఉత్తరభాగంలో ఉద్భవించిన వేదవతి (బేత్ వా) నదీ జలాలను ఆస్వాదించు. అవంతి మీదుగా ఉజ్జయిని లోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మహాకాళేశ్వరుని దర్శించు. ఉజ్జయినీ నగరంలో ఉత్సవాలు కనుల పండువ చేస్తాయి. మహాకాళేశ్వరుని పూజను తిలకించు. హారతి సమయంలో నీ ఉరుములే మృదంగ నాదంలా తాళానికి తగ్గ ధ్వని చేయనీయి. అటుపిమ్మట గంభీరంగా ఉరుముతు ముందుకు సాగిపో. అక్కడ క్షిప్రా నదీ తరంగములను తాకి వచ్చే చల్లని గాలి ప్రేయసిని అనుసరించే ప్రియుని పోలి ఉంటుంది. తదుపరి గంభీరా నదికి ఎదురువెళ్ళి దేవగిరి వద్ద చల్లని గాలులతో జత కలుపు. నీవు ఉరిమితే కార్తికేయుని నెమలి ఆడాలి. తరువాత వింధ్య పర్వతాలకు వాయవ్య దిశలో ఉన్న చర్వణవతీ (చంబల్) నదిని దాటి రంతిదేవుని రాజధానినగరం దశపురం చేరుకో. బ్రహ్మావర్తము (సరస్వతి

దృషద్వతి నదుల మధ్య దేశం) వెళ్లి అక్కడనుండి మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రం చేరుకొని సాగిపో. సరస్వతీ నదీ జలాలయందు పునీతుడవుకా. గంగమ్మ కానవస్తుంది విశ్వనాథుడిని తలచుకొంటూ గంగానది వెంబడే పయనించి హరిద్వార్ వద్ద నున్న కనఖలం నుండి హిమవత్ పర్వతం మీదుగా కైలాసం చేరి ఆది దంపతులను దర్శించి వారి ఆతిథ్యము ఆరగించు. గౌరీదేవి కైలాస పర్వతాన్ని ఎక్కి చేరుకోవటానికి ఒకవేళ అవస్థ పడితే, నీవే సోపానములుగా మారి ఆమెకు శ్రమను తెలియనివ్వకు. ఆ వెంటనే మానస సరోవరం వద్ద కొద్దిసేపు ఆగి అచటి జలాలను గ్రోలి ముందుకు సాగగానే నీకు కన్నుల పండువగా అలాకానగరం కనిపిస్తుంది. అంటూ యక్షుడు మేఘునకు మార్గ నిర్దేశం చేశాడు.

ఉత్తర మేఘం

కాళిదాసు ఉత్తరమేఘ భాగంలో అలకానగరమును, ఆ నగరము యొక్క శోభను యక్షుని ద్వారా వర్ణన చేశాడు. యక్షుడు మేఘునితో 'మిత్రమా, అలకానగర వర్ణన ఏమని చెప్పమంటావు, అది భావుకులకు కూడా అందనంత అందమైనది. ఆ నగరంలో ఎత్తైన భవనాలు అంబరాన్ని అంటుతూ ఉంటాయి. నీతో పోటీ పడుతుంటాయి. మెరుపు సఖి నిన్నే అంటి పెట్టుకొని ఉన్నట్లు, ఆ భవనాలలో సుందరీమణులు కడు శోభ కలిగి ఉంటారు. వర్ణ చిత్రాలతో, మధురమైన సంగీత స్వరములతో, తళుకులీను ఇంద్రనీల మణుల కాంతులతో ఆ భవనాలు ఇంద్ర భవనాలను పోలివుంటాయి. అయితే నీవు మాత్రం నీ నీరదములతో భవనములలోనికి చొరబడి ఆ చిత్రములపై తడి చిమ్మకుము. ఇక నెచ్చెలి ఉన్న నా భవనము సంగతి అంటావా, కుబేరుని రాజ ప్రాసాదమునకు ఉత్తరాన ఇంద్రధనస్సువలె రమణీయమై చూపరులకు కన్పట్టుతూ ఉంటుంది. కల్పవృక్షము, మణిగణ ఖచితమైన సోపానములు గల బావి, కృతక పర్వతము, కనులకు ఇంపైన వకుళ అశోక వృక్షములు, ద్వారమునకు ఇరుప్రక్కలా శోభాయమానంగా అలరారుతున్న శంఖ పద్మములు నా యింటి గురుతులు అని గురుతుంచుకో.

అట్టి నా భవనమునందు సన్నని నడుము, సొంపైన సౌష్ఠవము, కలిగిఉన్న హరిణేక్షణ నా ప్రేయసియే అని యెఱుఁగుము. ఆమె నా బహిఃప్రాణము, నా వియోగముతో కలత చెంది తపించుచున్నది. అక్కడ నా పత్ని వియోగం భరించలేక తొలిపొడుపు చంద్ర రేఖ వలె శయ్యపై

పవ్వళించి ఉంటుంది. ఒకవేళ ఆమె నిద్రిస్తూ ఉంటె సడి చేయక దయజేసి వేచి ఉండు. ఆమెను మెల్లగ మేలుకొలిపి మందస్వరముతో ఈ నా సందేశమును వినిపింపుము.

'కల్యాణీ విధి వక్రించి శిక్షను అనుభవించుచున్న నీ కాంతుడు రామగిరి ఆశ్రమమున కుశలముగా యున్నాడు. నీయందలి ప్రేమతో వియోగ బాధను అనుభవించుచున్నా శిక్షా కాలము ముగిసిన వెంటనే నీ సంయోగమువలన లభించు భోగములను తలచుకొని ఊరట చెందుచున్నాడు. అతడి ఎడబాటుచేత నీవు నిరాశ చెందవలదు, ధైర్యము కోల్పోవలదు. కష్టములు కలకాలముండవు, కడతేరక మానవు. కాలము ఆగదుకదా, ఊరడిల్లుము. మిగిలిన నాలుగు నెలల కాలము ఎంతలో ముగిసిపోతుంది, ఆపైన అంతా ఆనందమేకదా. నిరీక్షణ, బాధతో కూడుకున్నదే అయినా అది మధురమైనది. నీ మనోహరుడు త్వరలో నిన్ను చేరుకోగలడు.'

అని యక్షుడు తన సందేశమును తెలిపి మేఘునితో ఇలా అంటున్నాడు. 'మిత్రమా, జలదా, వేరే మార్గము లేక నా ఈ సందేశమును నీద్వారా పంపుతున్నాను. దూత కార్యము నీకు అప్పగించుచున్నాను. ఈ విధముగా నీపై నాయొక్క కార్య భారముంచినందుకు చింతించుచున్నాను. నా ధూర్తత్వమునకు మన్నించు. నా స్థితిని గమనింపుము. నా సందేశమును నా ప్రియురాలికి చేరవేయుము. ఆపై నీ ఇష్టము నీవు ఎటైనా పోవచ్చును. కానీ నా మనోరథమును నెరవేర్చుము. నీ కిటువంటి అవస్థ రాకూడదని నీ ప్రియురాలితో నీకెన్నడు వియోగము సంభవింపకూడదని కోరుకుంటున్నాను' అని యక్షుడు తన ప్రేయసికి పంపదలచుకున్న సందేశమును మేఘునకు అందజేశాడు. మేఘుడు కూడా యక్షుని యొక్క దయనీయమైన స్థితిని గాంచి హృదయము ద్రవించి యక్షుని కార్యము సఫలము చేయవలెనని తలంచి ఆకాశమార్గాన పయనించి అలకాపురి చేరుకొని, యక్షుని సందేశాన్ని యక్షిణికి అందజేశాడు. కుబేరుడు కూడా విషయమును తెలిసికొని తాను ఇచ్చిన శాపకారణముగా యక్ష దంపతులు వేదన చెందారని గ్రహించి శాపమును ఉపసంహరించుకొని యక్షిణీ యక్షులకు ఆనందమును కలిగించెను. అప్పుడు ఆ యువ దంపతులు పునః కలయికతో ముదమంది భోగముల ననుభవించారు.

అయితే మేఘం అలా నెమ్మదిగా అలాకానగరం చేరుకునేసరికి, యక్షుడు సంవత్సర కాలం పూర్తి చేసికొని భార్యను చేరుకున్నాడని కొన్ని చోట్ల చెప్పబడింది.

మేఘసందేశము కాళిదాసుచేత కల్పింపబడిన కావ్య సృష్టి . అది ఒక కల్పన. ఆ కల్పనను కవి అత్యంత మనోహరంగా రమణీయంగా తీర్చి దిద్ది చదువరులను ఊహాలోకాలలో విహరింపజేశారు. మన పురాణాలలో ఎడబాటును అనుభవిస్తున్న ప్రేయసీ ప్రియులు ఒకరికొకరు తమ సందేశమును పంపటానికి వివిధ మార్గాలను ఎంచుకున్నారు. నల దమయంతులు హంస రాయబారము నడిపారు. రుక్మిణి తన మనసులోని భావాన్ని తన సందేశాన్ని బ్రాహ్మణునిద్వారా శ్రీకృష్ణునకు చేరవేసింది. కృష్ణునకు బ్రాహ్మణుని ద్వారా పంపిన సందేశము చేరినదో లేదో అని రుక్మిణి కలవరపాటు చెందింది. 'ఘనుడా భూసురుఁడేగెనో ? నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో' అనుకుంటూ తల్లడిల్లి పోయింది. రామాయణంలో హనుమ రామదూతగా లంకకు వెళ్లి సీతమ్మ జాడ కనుగొని రామ సందేశాన్ని అందజేశాడు.

కానీ ఆకాశములో తేలియాడుతున్న మేఘమును దూతగా చేసికొని సందేశాన్ని ప్రేయసికి పంపవచ్చునన్న ఊహ ఒక్క కాళిదాసుకే తట్టింది. ఇది కల్పనే అయినా కవిత్వంలో ఒక వినూత్నమైన వరవడిని సృష్టించింది. అందమైన ఈ ఊహా కావ్యాన్ని అనుసరిస్తూ ఎన్నో కావ్యాలు కలం దిద్దుకున్నాయి. అది కాళిదాస మహాకవి ప్రతిభ, అతడి గొప్పతనం, అతడి ఊహా చాతుర్యం అనక తప్పదు.

వీరత్వము ఆలోచనా రెండు కలిగినవాడు ధీరోదాత్తుడు. కాళిదాసు తన రచనలలో ఎప్పడు నాయకుని ధీరోదాత్తునిగా నే మలిచాడు. శాకుంతలం లో అదే జరిగి అభిజ్ఞాన శాకుంతలం అయింది. మేఘసందేశంలో కూడా నాయకుని ధీరోదాత్తునిగా చెప్పాడు కాళిదాసు.

ఇక కావ్యంలో వర్ణన. కాళిదాసు వర్ణన చేసి భావాన్ని వ్యక్తం చేయటంలో దిట్ట. ఆమ్రకూట పర్వతాన్ని, అక్కడ ప్రవహించే రేవా నదిని చూచి ఆ నది ఏనుగు పెట్టుకున్న విబూది వలె ఉన్నదని వర్ణించాడు. చర్మణవతీ నది ఆకాశం నుండి చుస్తే ముత్యాల హారం లా కనిపిస్తుందని, మేఘుడు ఆనీటికోసం వంగినప్పడు హారం మధ్యనున్న ఇంద్రనీల మణి వలె ఉన్నాడనీ చెప్పటం అద్భుతమైన పోలిక. అది కాళిదాసునకే చెల్లింది.

అద్భుతమైన ఉపమానాలతో విరహం, ప్రేమ, అనురాగం, ప్రకృతి వర్ణన, ఆధ్యాత్మిక ప్రదేశాల వర్ణన, సమపాళ్లలో పండి మనోజ్ఞం గా సాగిన కావ్యం మేఘసందేశం.